క్లుప్తంగా

ధ్యానంతో మానసిక ప్రశాంతత



ధ్యాన మందిరాన్ని సందర్శించిన డాక్టర్ మట్టా రాగమయి

సత్తుపల్లిరూరల్: ధ్యానం చేయటం వల్ల మానసిక ప్రశాంతత లభిస్తుందని కాంగ్రెస్ పార్టీ నాయకురాలు డాక్టర్ మట్టా రాగమయి అన్నారు. ఆదివారం స్థానిక తామరచెరువు సమీపంలో ఉన్న పిరమిడ్ సెంటర్‌లో ధ్యానులను కలిసి ఆమె మాట్లాడారు. ప్రస్తుత కాలంలో ధ్యానం చేయటం చాలా అవసరమని, మందులతో పాటు ధ్యానం చేయాలని, దీనివల్ల ఎక్కువగా మనకు వచ్చే రోగాలు తగ్గిపోతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సుస్మిత, మొరిశెట్టి సాంబశివరావు ఉన్నారు.

మంత్రిని కలిసిన జెడ్పీ చైర్మన్



మంత్రి ప్రశాంతరెడ్డితో జెడ్పీ చైర్మన్ కమల్‌రాజ్

మధిర: మధిర నియోజకవర్గ పరిధిలో రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని రోడ్లు భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డికి ఖమ్మం జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమల్ రాజ్ విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్‌లోని మినిస్టర్ క్వార్టర్స్‌లో ఆర్అండ్‌బీ మంత్రిని ఆదివారం ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. మధిర నియోజకవర్గంలో పలు రోడ్లు ధ్వంసం అయ్యాయని మంత్రికి తెలిపారు. ఈ విషయంపై మంత్రి సానుకూలంగా స్పందించి నిధులు మంజూరీకి కృషి చేస్తానని చెప్పినట్లు తెలిపారు.

రైతుల సమస్యలపై నేడు ధర్నా

కొణిజర్ల: రైతాంగ సమస్యలు పరిష్కారం కోరుతూ నేడు తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని తెలంగాణ రైతు సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు దారగాని రాములు, యరమల మాధవరెడ్డి పిలుపునిచ్చారు. సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీ మేరకు రూ.లక్ష రుణ మాఫీ చేయాలని, సాగు భూమి కలిగి ఉండి ధరణి పోర్టల్ ద్వారా పట్టాలు పొందని రైతులందరికీ పట్టాదారు పాస్ పుస్తకాలు అందజేయాలన్నారు. యాసంగి పంట నష్ట పరిహారం అందని రైతులకు తక్షణమే నష్టపరిహారం ఇవ్వాలని తదితర డిమాండ్‌లతో తహసీల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ధర్నాకు మండలంలోని రైతులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా



మాట్లాడుతున్న నారపోగు దీప్తి

సత్తుపల్లి: రానున్న ఎన్నికల్లో సత్తుపల్లి నియోజకవర్గ ప్రజలు ఆదరిస్తే సమస్యల పరిష్కారానికి కృషి చేసి అభివృద్ధి చేస్తానని స్వతంత్ర అభ్యర్థి నారపోగు దీప్తి అన్నారు. సత్తుపల్లిలోని జేవీఆర్‌పార్కు వద్ద ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నియోజకవర్గం నుంచి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల మద్దతుతో పోటీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో తగరం రాంబాబు, కొలికపోగు ధర్మరాజు, కేశవగౌడ్, చిట్టూరి వెంకట్, సాయికుమారి, ప్రభాకర్ పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

తల్లాడ: మండలంలోని మల్లవరం గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన ఎండి.జాఫర్ కుటుంబాన్ని ఆదివారం మాజీ మంత్రి సంభాని చంద్రశేఖర్, జిల్లా కాంగ్రెస్ నాయకుడు మట్టా దయానంద్ పరామర్శించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు దగ్గుల రఘుపతిరెడ్డి, కాపా సుదాకర్, కటికి కిరణ్, భూషణం, శ్రీను, జమాల్, దుండేటి వీరారెడ్డి, పొన్నం కృష్ణయ్య, సరికొండ అప్పల్‌రాజు పాల్గొన్నారు.



జాఫర్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న మట్టా దయానంద్

ముందుకు సాగని ఖరీఫ్

- వర్షాల కోసం ఎదురుచూస్తున్న రైతన్నలు
- ఎండుతున్న పంటలు
- సాధారణ వర్షపాతం కంటే తక్కువగా కురిసిన వర్షం
- ఈ ఏడాది సాగు ఆలస్యం



వర్షాలు లేక ఎండిపోతున్న నారుమడులు

తల్లాడ: ఖరీఫ్ సాగుపై గంపెడాశలు పెట్టుకున్న రైతన్నలకు నిరాశే మిగులుతుంది. వర్షాలు సరిగా పడకపోవడంతో వ్యవసాయ పనులు ముందుకు సాగడం లేదు. ప్రతి ఏటా జూన్ మొదటివారంలో వర్షాలు ప్రారంభం కావాల్సి ఉంది. కానీ ఈ ఏడాది దానికి భిన్నంగా జూన్ నెల, జూలై మొదటివారం గడిచినా సాధారణ వర్షాపాతం కంటే తక్కువగానే వర్షాలు కురిశాయి. తల్లాడ మండలంలో చెరువులు కుంటల కింద ఈ పాటికే ముమ్మరంగా వరి నాట్లు వేయాల్సి ఉండగా ఈ ఏడాది కనీసం వరి నార్లు కూడా పోయలేదు.

సాధారణ వర్షపాతం కంటే తక్కువగా..

ఈ ఏడాది సాదారణ వర్షపాతం కంటే తక్కువగా వర్షం పడింది. జూన్ నెలలో 105.0 మిల్లీ మీటర్ల వర్షం పడాల్సి ఉండగా 64.0 ఎంఎం మాత్రమే కురిసింది. జులై నెల మొదటి వారంలో 56.08 కురవాల్సి ఉండగా 21.02 మాత్రమే వర్షం పడింది. దీంతో చెరువులు, కుంటల్లో నీరు అడుగంటిపోయింది. మామూలుగా అయితే ఈపాటికే చెరువులు సగం నిండి ఉండేవి. మండలంలో 19 చెరువులు, కుంటలు ఉన్నాయి. వీటి కింద సుమారు నాలుగువేల ఎకరాల ఆయకట్టు ఉంది. చెరువుల్లో నీరు లేక ఖరీఫ్ ఈ సారి ఆలస్యమవుతుంది.

దట్టంగా పెరిగిన తూటికాడ..

మండలంలోని పలు చెరువుల్లో తూటికాడ, పిచ్చి తీగ అల్లుకుపోయింది. తల్లాడలోని మూడు చెరువుల్లో, మల్లవరం, ముద్దునూరు, బిల్లుపాడు, రంగం బంజర, కలకొడిమ, కుర్నవల్లి, నూతనకల్, అన్నారుగూడెం చెరువుల్లో తూటికాడ బాగా పెరిగిపోయింది. దీంతో చెరువుల్లో నిల్వ నీటి సామర్థ్యం తగ్గిపోయే అవకాశం ఉంది.

దుక్కులు దున్ని సిద్ధంగా ఉంచిన రైతులు..

ఈ ఏడాది వర్షాలు సరిగా కురవక పోవడంతో ఖరీఫ్ వ్యవసాయ సీజన్‌లో రైతులు దుక్కులు దున్ని వరి పైరు వేసేందుకు సిద్దంగా ఉంచారు. అడపా దడపా కురిసిన వర్షాలకు దుక్కులు దున్ని ఉంచారు. చెరువులు నిండితే అలుగుల ద్వారా తూముల ద్వారా ఆయకట్టుకు సాగు నీరు సరఫరా అయ్యేది. అందుకు పరిస్థితి భిన్నంగా ఉండటంతో కనీసం వరినార్లు కూడా పోసుకోలేదు.

మెట్టపైర్ల పరిస్థితి కూడా అంతే ఉంది..

తల్లాడ మండలంలో వర్షాభావం వల్ల మెట్టపైర్ల పరిస్థితి కూడా అంతే ఉంది. పత్తి గింజలు పెట్టినా అవి మొలకెత్తలేదు. మిర్చి నారు పెంపకం కూడా రైతులు చేపట్టలేదు. దీంతో ఈ ఏడాది ఖరీఫ్ వ్యవసాయ సీజన్ బాగా ఆలస్యమైంది. తల్లాడ మండలంలో సుమారు 6 వేల ఎకరాల్లో పత్తి, 5 వేల ఎకరాల్లో మిర్చి, 2వేల ఎకరాల్లో మొక్కజొన్న, 1,500 ఎకరాల్లో కంది పంట సాగు చేస్తుంటారు.

ఎన్నెస్పీ కింద కూడా ఆలస్యమే..

వార్షాలు రాకపోవడంతో సాగర్ ఆయకట్టులో నీటి మట్టం సరిగా లేదు. కావున నాగార్జున సాగర్ కాల్వలకు కూడా ఈ సారి నీటి సరఫరా ఆలస్యమవుతుందని ఎన్ఎస్‌పీ అధికారులు చెబుతున్నారు. ఎన్ఎస్‌పీ కింద మండలంలో 20 వేల ఎకరాల్లో వరి పైరు సాగు చేస్తారు.



బీడుగా మారిన గుంటు చెరువులో పశువులు మేస్తున్న దృశ్యం

సకాలంలో వర్షాలు పడలేదు..



ఈ ఏడాది ఖరీఫ్ వ్యవసాయ సీజన్‌లో సకాలంలో వర్షాలు పడలేదు. వర్షాలు కురవక పోవటంతో వ్యవసాయ పనులు నిలిచిపోయాయి. ఈ పాటికే వరి నార్లు పోసి చెరువుల కింద వరి నార్లు వేసే వాళ్లం. ఈ సంవత్సరం జులై మొదటి వారం దాటినా చెరువుల్లో చుక్క నీరులేదు. పంటలు పండే పరిస్థితి కనిపించడం లేదు.

– సున్నం రాము, తల్లాడ

చెరువుల్లోకి నీరు చేరలేదు..



వర్షాలు కురవక చెరువుల్లోకి నీరు రాలేదు. చెరువుల కింద ఉన్న ఆయకట్టు దారులు వ్యవసాయ పనులు నిలిచిపోయాయి. ఈ సంవత్సరం వర్షాలు లేక చెరువులు నెర్రెలు బారాయి. చెరువులు అలుగులు పడాల్సిన తరుణంలో నీరు లేక అడుగంటి కనిపిస్తున్నాయి. వ్యవసాయ పనులు ఆలస్యమౌతున్నాయి.

– దగ్గుల శ్రీనివాసరెడ్డి, రైతు, తల్లాడ

కొనసాగుతున్న పంచాయతీ వర్కర్ల సమ్మె



కల్లూరు: సమ్మెలో పాల్గొని మాట్లాడుతున్న మాజీ ఎంపీ పొంగులేటి



ఎర్రుపాలెంలో సమ్మె చేస్తున్న పంచాయతీ వర్కర్లు



సంఘీభావం తెలుపుతున్న సంభాని చంద్రశేఖర్

కల్లూరు: నాలుగురోజులుగా చేస్తున్న జీపీ కార్మికుల సమ్మెకు మాజీ ఎంపీ పొంగులేటి, సంభానిలు ఆదివారం సంఘీభావం తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద సమ్మె శిబిరానికి వేరువేరుగా చేరుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పంచాయతీ కార్మికుల న్యాయమైన సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలన్నారు. అదే విధంగా సమ్మె శిబిరాన్ని సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా ఖమ్మం జిల్లా కార్యదర్శి గోగినపల్లి వెంకటేశ్వరరావు, ఇఫ్టూ జిల్లా అధ్యక్షుడు వెంకన్న, నాయకుడు ఖమ్మంపాటి పుల్లారావులు సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో పొంగులేటి అనుచరులు కొండూరు సుధాకర్, పంచాయతీ వర్కర్స్ యూనియన్ నాయకులు కృష్ణ, వజీర్ మియా, సుధాకర్, శ్రీను, గోపికృష్ణ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దుర్గాప్రసాద్, రఘుపతిరెడ్డి, వంశీ, కృష్ణారెడ్డి, కిరణ్‌కుమార్, ఉస్మాన్ పాల్గొన్నారు.

ఎర్రుపాలెం: జీపీ కార్మికుల సమ్మెను పంచాయతీ వర్కర్ల సంఘం మండల కమిటీ గౌరవ అధ్యక్షుడు దూదిగం శ్రీనివాసరావు, అధ్యక్షుడు గంతాల నాగేశ్వరరావులు సందర్శించి మాట్లాడారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు శ్రీనివాసరావు, కార్యదర్శి రవి, కోశాధికారి నాగేశ్వరరావు, పాల్గొన్నారు.

చింతకాని: జీపీ కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోరుతూ.. మండల పరిషత్ కార్యాలయం ఎదుట గ్రామ పంచాయతీ కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మెకు బీజేపీ మండలాధ్యక్షుడు వీరప్రసాద్ సంఘీభావం తెలిపి మాట్లాడారు. కార్యక్రమంలో బీజేపీ యువమోర్చా మండల అధ్యక్షుడు గోపి, బీజేపీ మండల కార్యదర్శి వెంకన్న, ఉపాధ్యక్షుడు శ్రీను, నాయకులు పాల్గొన్నారు.

ఏన్కూరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఎదుట పంచాయతీ కార్మికులు సమ్మెకు సీఐటీయూ మండల కార్యదర్శి ఏర్పుల రాములు సంఘీభావం తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా పంచాయితీ కార్మికులకు ఉద్యోగభద్రత కల్పించాలని కోరారు.

11న వాహనాలకు వేలం

మధిర: ఎక్సైజ్ నేరాల్లో పట్టుబడ్డ వాహనాలకు ఈ నెల 11న ఉదయం మధిర ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ కార్యాలయంలో బహిరంగ వేలంపాట ప్రక్రియ జరుగుతుందని ఎక్సైజ్ సీఐ ఎం.ప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. టాటా విస్టా కారు రూ.75 వేలకు ధర నిర్ణయించడం జరిగిందని, వేలం పాటలో పాల్గొనదలచిన వారు 50 శాతం ఎస్టిమేట్ మనీ డిపాజిట్‌గా డీడీ గాని, చెక్కు కానీ జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఆఫీసర్ ఖమ్మం వారి పేరుతో తీసుకొని మధిర ఎక్సైజ్ కార్యాలయంలో అందజేయాలని సూచించారు. పూర్తి వివరాలను ఎక్సైజ్ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

కాంగ్రెస్‌తో ఒరిగేదేమీ లేదు

కారేపల్లి: కాంగ్రెస్ పార్టీతో పేద ప్రజలకు ఒరిగేది ఏమీ లేదని ఎంపీపీ మాలోత్ శకుంతల, మండల అధ్యక్షుడు పెద్దబోయిన ఉమాశంకర్ అన్నారు. ఆదివారం కారేపల్లి బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. బీఆర్ఎస్ సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నారని తెలిపారు. ఈ సందర్భంగా సింగరేణి మండల కోఆప్షన్ మెంబర్ ఎండీ హనీఫ్, సింగరేణి ఉప సర్పంచ్ మణికొండ నాగేశ్వరరావు, వార్డు సభ్యులు రమేష్ బీఆర్ఎస్ పార్టీలోకి చేరడంతో, వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సమావేశంలో వైస్ ఎంపీపీ శ్రీనివాసరావు, మాజీ ఆత్మకమిటీ చైర్మన్ సత్యనారాయణ, సొసైటీ చైర్మన్ శ్రీనివాసరావు, మాజీ మండల అధ్యక్షుడు రాంబాబు, సంతగుడి చైర్మన్ ఐలయ్య, రోషయ్య, సర్పంచ్ కిషోర్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కేసు నమోదు

చింతకాని: పొలానికి నీళ్ల పెట్టే విషయంలో ఒక వ్యక్తిపై దాడికి పాల్పడిన ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పొదిల వెంకన్న తెలిపారు. మండలంలోని అచ్చుగూడెం గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లుపై ఆదివారం ఆదే గ్రామానికి చెందిన పోలంపల్లి గోపయ్య, అతని కుమారుడు ఇద్దరు కలిసి దాడికి పాల్పడ్డారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

భూమిపూజ



లైబ్రరీ రీడింగ్ హాల్ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ప్రజాప్రతినిధులు

కల్లూరురూరల్: మండలంలోని చెన్నూరులో లైబ్రరీ రీడింగ్ హాల్ నిర్మాణానికి ఆదివారం భూమిపూజ నిర్వహించారు. దీనికి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య రూ.25లక్షల నిధులు మంజూరు చేయడంతో.. గ్రామ సర్పంచ్ పాలెపు లక్ష్మీకాంతమ్మ, సొసైటీ చైర్మన్ పాలెపు రామారావు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు శ్రీనివాసరావు, యశోద, బీఆర్ఎస్ నాయకులు అప్పారావు, వెంకటేశ్వరరావు, వెంకటకృష్ణ, వెంకన్న, లక్ష్మయ్య, ఇస్సాకు, ఏఈ సాంబశివరావు పాల్గొన్నారు.

కొండూరి సుధాకర్ పర్యటన



ముద్దునూరు దళితకాలనీ వాసులతో కొండూరి సుధాకర్

తల్లాడ: మండలంలోని ముద్దునూరు, కలకొడిమ గ్రామాల్లో సత్తుపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ నాయకుడు కొండూరి సుధాకర్ ఆదివారం పర్యటించారు. కలకొడిమ గ్రామంలో పాపకంటి నరేష్‌ను పరామర్శించి ఆర్థిక సాయం అందించారు. ముద్దునూరులో యరమల వెంకటేశ్వరరెడ్డి ఆద్వర్యంలో ఎస్సీ కాలనీలోని చర్చిలో ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు. సత్తుపల్లి అసెంబ్లీలో సుధాకర్ గెలవాలనీ ప్రార్థనలు చేశారు. ఎస్సీ కాలనీవాసుల సమస్యలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో కలకొడిమ, గొల్లగూడెం సర్పంచులు ఆదూరి దాసురావు, నారపోగు వెంకటేశ్వరరావు, పోట్రు శ్రీనివాసరావు, మాగంటి శ్రీను, ఇనుపనూరి ప్రకాశం, సురేష్, ప్రసాద్, సంజీవరావు, జయరాజు, నాగరాజు, బాబురావు, ముత్తయ్య, వెంకటనరసయ్య పాల్గొన్నారు.

ఘనంగా ద్వారకాసాయి మందిర వార్షికోత్సవం



సాయినాధునికి పూజలు చేస్తున్న భక్తులు

సత్తుపల్లిటౌన్: పట్టణంలోని ద్వారకాపురి కాలనీలో గల శ్రీద్వారకాసాయి శాంతిమందిరం 16వ వార్షికోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సాయినాధుడికి కాగడ హారతి, పంచామృతాభిషేకాలు, సహస్రనామార్చనలు, శాంతిహోమం, విశేష పూజలు నిర్వహించారు. భక్తులకు మహాఅన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యుఎస్ శాస్త్రి, భక్తులు పాల్గొన్నారు.

వెంచర్ నిర్వాహకుల తీరుతో రైతుల ఆందోళన

కొణిజర్ల: మండలంలోని పెద్దగోపతి సమీపాన ఓ రియల్ ఎస్టేట్ సంస్థ నిర్వాహకులు ఏర్పాటు చేసిన వెంచర్‌తో రైతులు ఆందోళన చెందుతున్నారు. పెద్దగోపతి సమీపంలో దామర్ల కుంట ఉండగా, ఎఫ్‌టీఎల్ పూడిపోయేలా వెంచర్ నిర్వాహకులు మట్టి పోశారని చెబుతున్నారు. దీనికి తోడు చెరువు విస్తీర్ణం 25 ఎకరాలు కాగా, అధికారులు 21 ఎకరాలుగానే నివేదిక రూపొందించారు. ఇప్పుడు వెంచర్ నిర్వాహకులు కలవ్వర్టును పూడ్చివేయడంతో నీరు వెళ్లే మార్గం లేక పొలాలు మునిగే ప్రమాదం ఉందని రైతులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికే కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేసిన తాము సోమవారం గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

భక్తి శ్రద్ధలతో ఆషాఢ బోనాలు



సత్తుపల్లిటౌన్: బోనాలతో ఆదివాసీ గిరిజన మహిళలు



కారేపల్లి క్రాస్‌రోడ్డులో ఎర్రమ్మతల్లికి పూజలు చేస్తున్న భక్తులు



వైరారూరల్: బొడ్రాయి వద్ద పూజలు చేస్తున్న దృశ్యం

చింతకాని/సత్తుపల్లిటౌన్/ఏన్కూరు/వైరారూరల్/కారేపల్లి: మండలంలోని నేరడ గ్రామంలో గురుజు మైసమ్మతల్లికి, సత్తుపల్లిలోని గుడిపాడు కాలనీలోని పెద్దమ్మతల్లికి, ఏన్కూరులోని శ్రీమద్విరాట్ వీర బ్రహ్మేంద్రస్వామి సన్నిదిలోని పోలేరమ్మ తల్లికి, వైరా మండలంలోని తాటిపూడి గ్రామంలోని ముత్యాలమ్మతల్లికి, కారేపల్లి మండలంలోని కారేపల్లిక్రాస్‌రోడ్డులోని ఎర్రమ్మతల్లికి, చంద్రళ్లగూడెం సమీపంలోని సమక్క–సారక్క గద్దెల వద్దకు వెళ్లి ఆషాఢమాసంలో మహిళలు ఆదివారం బోనాలు సమర్పించారు. మహిళలు బోనాలను నెత్తిన పెట్టుకుని డప్పు వాయిద్యాలతో అమ్మవార్ల ఆలయాలకు వెళ్లి పసుపు, కుంకుమలతో ప్రత్యేక పూజలు చేసి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామప్రజలు వర్షాలు కురవాలని, పాడిపంటలతో, సుఖసంతోషాలతో ఉండాలని ప్రార్థించారు. సత్తుపల్లిలో బోనమెత్తిన మహిళలకు జిల్లా కాంగ్రెస్ నాయకురాలు డాక్టర్ మట్టా రాగమయి శుభాకాంక్షలు తెలిపారు. భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామసర్పంచ్ ఈశ్వరమ్మ, ఉపసర్పంచ్ గోపాలరావు, ఎంపీటీసీ యామిని, పూచి గోవర్ధన్, మారుతి బాబురావు, మట్టా సుజాత, సాయి శ్రీనివాస్, గంటా విష్ణు, బోగి వీరాస్వామి, నరేష్, సుజాత, దుర్గమ్మ, పుల్లమ్మ గ్రామపెద్దలు మొలకం నాగేశ్వరరావు, ధనసరి గురవయ్య, ధనసరి రామ్మూర్తి, మొలకం పుల్లయ్య, ఎదలపల్లి సంపత్, వీరస్వామి, రాంబాబు, నవీన్, యువరాజు, సందీప్, రాజు తదితరులు పాల్గొన్నారు.



చింతకాని: నేరడ గ్రామంలో మైసమ్మతల్లికి బోనాలు సమర్పిస్తున్న మహిళలు



ఏన్కూరు: బోనాలు సమర్పిస్తున్న మహిళలు

రైతులందరికీ పట్టాలు ఇవ్వాలి



మాట్లాడుతున్న బొంతు రాంబాబు

వైరా: సాగుభూములు కలిగిన రైతులందరికీ ధరణి పోర్టల్ ద్వారా పట్టాదారు పాస్ పుస్తకాలు మంజూరు చేయాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు బుర్రి ప్రసాద్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు రాంబాబు డిమాండ్ చేశారు. ఆదివారం వైరా బోడేపూడి వెంకటేశ్వరరావు భవన్‌లో సీపీఎం రాజకీయ శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా రెండో రోజు వర్తమాన రాజకీయాలపై బొంతు రాంబాబు, మిత వాత రాజకీయాలపై బుర్రి ప్రసాద్ మాట్లాడారు. కార్యక్రమంలో సీపీఎం వైరా మండల కార్యదర్శి నాగేశ్వరరావు, సీపీఎం వైరా పట్టణ కార్యదర్శి వర్గ సభ్యుడు చలపతిరావు, రామారావు, మాజీ ఎంపీపీ సమత, వెంకటేశ్వరరావు, నరసింహారావు, బత్తిరన్న, శ్రీనాద్‌బాబు, రాంబాబు, పురుషోత్తం, శ్రీనివాసరావు, వీరభద్రం, కృష్ణవేణి, మల్లిక, కృష్ణకుమారి, కళావతి తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ



చెక్కు అందిస్తున్న వెంకటేశ్వర్లు

చింతకాని: మండలంలోని గాంధీనగర్‌కాలనీ, పందిళ్లపల్లి గ్రామాలకు చెందిన లబ్ధిదారులు షేక్ ఆష్రఫ్, ఇనుకుళ్ల సీతారామిరెడ్డిలకు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అంబటి వెంకటేశ్వర్లు సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అనారోగ్యంతో బాధపడుతున్న ఆష్రఫ్, సీతారామిరెడ్డిలకు వైద్య ఖర్చుల నిమిత్తం సీఎల్పీ నేత, మధిర శాసనసభ్యుడు మల్లు భట్టి విక్రమార్క సిఫారసుతో మంజూరైన రూ.1.20 లక్షల చెక్కులను అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పందిళ్లపల్లి ఎంపీటీసీ వీరభద్రం, నాయకులు గోపి, నాగార్జున్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి ఆలయ కమిటీ అధ్యక్షురాలిగా ప్రమీల



సమావేశంలో పాల్గొన్న సభ్యులు

మధిర: మధిర పట్టణంలోని బంజారా కాలనీలో వేంచేసి ఉన్న శ్రీ లక్ష్మీ పద్మావతి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ కమిటీ అధ్యక్షురాలిగా గుర్రం ప్రమీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం స్థానిక శ్రీవారి ఆలయంలో ఆలయ కమిటీ జనరల్ బాడీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ధర్మకర్తలు, కమిటీ సభ్యులు పాల్గొని నూతన ఆలయ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆలయ కమిటీ సభ్యులు, దాతలు, భక్తుల సహకారంతో ఆలయాన్ని మరింత అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు గొండేల ముత్తయ్య, గౌరవ అధ్యక్షులు రంగా వెంకటేశ్వర్లు, గంగవరపు వీరారెడ్డి, కల్యాణపు పుల్లారావు, కటకం నరసింహారావు, తలపరెడ్డి నాగిరెడ్డి పాల్గొన్నారు.

సాయిచంద్‌కు ఘన నివాళులు



సాయిచంద్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

సత్తుపల్లిరూరల్: ప్రముఖ జానపద గాయకుడు, తెలంగాణ గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్ సాయిచంద్ గుండెపోటుతో మృతి చెందాడు. ఆయన చిత్రపటానికి సత్తుపల్లి మండల రేజర్ల గ్రామంలో ఆదివారం బీఆర్ఎస్ నాయకులు చింతల సురేందర్ రెడ్డి, గుర్రాల సురేష్‌ల ఆధ్వర్యంలో పూలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో వెంకటరెడ్డి, సత్యనారాయణరెడ్డి, సర్వేశ్వరరావు, రంగారెడ్డి, నాగిరెడ్డి, నారాయణ, అర్జున్‌రావు, శ్రీనివాసరావు, శ్రీను, కృష్ణ, నర్సింహారావు, వీరభద్రం, సుబ్బారెడ్డి, బాబు, మోయిస్, రమేష్, జయరాజు, కృష్ణ, వంశి, ఇమాం పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్

మరీ ఇంత నిర్లక్ష్యమా..



సత్తుపల్లి ప్రధాన రహదారి ఆరులైన్లు, సెంటర్ డివైడర్‌తో అందంగా ఉన్న పట్టణం ఏడాదిగా మిషన్ భగీరథ గుంతలతో అపరిశుభ్రంగా తయారైంది. మిషన్‌భగీరథ పైపులైన్లు వేసి పూడ్చిన తర్వాత సిమెంట్‌తో ఆ గుంతలను రహదారిలా చేయాల్సిన కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా వ్యవహరించటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గుంతల్లోని రాళ్లు లేచి ప్రమాదాలు జరుగుతున్నాయి. మరోవైపు రాత్రివేళల్లో కన్పించకపోవటంతో కిందపడిపోతున్నారు. వ్యాపారుల బాధలైతే చెప్పాల్సిన పనిలేదు. వర్షానికి బురద, ఎండకు దుమ్ము లేస్తూ.. దుకాణాలలో ఉండలేని పరిస్థితి నెలకొంది. దీనిపై మున్సిపల్ కమిషనర్ కె.సుజాతను వివరణ కోరగా కాంట్రాక్టర్‌కు నోటీసులు ఇచ్చామని, కఠిన చర్యలు తీసుకునేందుకు ఉపక్రమిస్తామన్నారు.

– సత్తుపల్లి

ప్రశ్నించాల్సిన అధికారి : సూరిబాబు, నేషనల్ హైవే డీఈ, ఖమ్మం
సెల్ నంబర్ : 7396874444